

ఆక్రమిస్తున్నా.. అడ్డుకోరెందుకు..?

● పట్టణంలో యథేచ్ఛగా కబ్జా పర్వం
● నాలాలపై అక్రమ నిర్మాణాలతో ఇక్కట్లు

నిర్మల్, న్యూస్‌టుడే

రోజురోజుకు పెరుగుతున్న జనాభాతో పట్టణాలు నలువైపులా విస్తరిస్తున్నాయి. ఈ క్రమంలో ప్రభుత్వ, చెరువు శిఖం భూములతో పాటు భూగర్భజలాల వృద్ధి కోసం తవ్వించిన కందకాలు, వరదనీరు వెళ్లడానికి ఇబ్బందులు తలెత్తకుండా నిర్మించిన కాలువలను ఆక్రమించి యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఇప్పటికే పట్టణం చుట్టూ ఉన్న గొలుసుకట్టు చెరువు శిఖం కబ్జాకు గురవుతుండగా.. తాజాగా పట్టణంలోని నాలాలు, కందకాలపై ఆక్రమణలు పెరిగిపోతున్నాయి. ఆక్రమిత స్థలాల్లో ఇంటి నిర్మాణాలకు 'పుర' అధికారులు ఇంటి నెంబర్లు, కుళాయి కనెక్షన్లు, విద్యుత్తు కనెక్షన్లు ఇస్తున్నారు.

చారిత్రక ప్రాముఖ్యత ఉన్న నిర్మల్‌లో కందకాల పాత్ర ఎంతో కీలకం. గతంలో నిర్మల్‌ను పాలించిన రాజులు రక్షణతో పాటు భూగర్భజలాల పెంపుకోసం పట్టణం చుట్టూ కందకాలు తవ్వించారు. ఇవి ఆక్రమణలకు గురికావడంతో వానకాలం ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు. సుమారు 30 అడుగుల వెడల్పు, 15 అడుగులకుపైగా లోతుతో ఉండే ఈ కందకాల్లో ఎప్పుడూ నీటిని నింపి అందులో మొసళ్లను ఉంచేవారని చరిత్ర చెబుతుంది. కాలక్రమేణా పట్టణం విస్తరిస్తుండటంతో ఒకప్పుడు పట్టణం చుట్టూ ఉన్న కందకాలు ఇప్పుడు నడిబొడ్డుకు చేరాయి. కొంతమంది అక్రమార్కుల స్వార్థంతో ఈ కందకాల భూములను ఆక్రమించుకుని స్వాధీనం చేసుకుంటున్నారు. కందకాలను సైతం ఆనవాళ్లు లేకుండా దెబ్బతీసే ప్రయత్నం చేస్తున్నారు. నాయిడివాడ, ద్యాగవాడ, బాగులవాడ, కురన్నపేట్, చిక్కడపల్లి, ఇంద్రానగర్, ప్రియదర్శినినగర్, చేపల మార్కెట్, భాగ్యనగర్, మదీనాకాలనీ, తదితర ప్రాంతాల్లోని కందకాలు ఆక్రమించుకుని నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

చర్యలు తీసుకుంటాం : సి.వి.ఎన్.రాజు, మున్సిపల్ కమిషనర్, నిర్మల్

పట్టణంలోని కందకాలు కబ్జాలకు గురికాకుండా చూస్తున్నాం. వాటిని ఆక్రమించిన వారిపై తగు చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా కందకాలు, నాలాలు ఆక్రమిస్తే తమ దృష్టికి తీసుకొస్తే అక్కడ విచారణ చేపట్టి ఆక్రమణలు జరిగినట్లు రుజువైతే వెంటనే తొలగిస్తాం.

అనుమతులు ఒక తీరు.. నిర్మాణాలు మరో తీరు..

ఇంటి నిర్మాణాల అనుమతులు ఒక తీరు ఉంటే.. నిర్మాణాలు మరో తీరుగా ఉంటున్నాయి. ఇంటి నిర్మాణం సమయంలో చుట్టూ ఖాళీ స్థలం (సెట్ బ్యాక్) వదిలి నిర్మించాల్సిన నిబంధన ఉంది. ఉమ్మడి జిల్లాలోని పట్టణాల్లో ఎవరూ పాటించడం లేదు. పైగా మురుగుకాలువలు, కందకాల పక్కన ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు తీసుకున్న కొంతమంది వాటిని మట్టితో పూడ్చేసి నిర్మాణాలు చేపడుతున్నారు. ఫలితంగా భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. ఇక చెరువు శిఖం భూముల్లోనూ నిర్మాణాలు చేయడం వల్ల ఆ చెరువుల్లో భారీగా వరదనీరు వచ్చినప్పుడు ఆ ప్రాంత ప్రజలు జలదిగ్బంధంలో ఉండిపోతున్నారు. మురుగు కాలువలు, కందకాలు, చెరువు శిఖం భూముల్లో ఉన్న ఆక్రమణలను అధికారులు తొలగిస్తే రానున్న రోజుల్లో ఇబ్బందులు ఉండవు. నాలాలు, కందకాల ఆక్రమణలతో వానాకాలంలో వరద నీటిలో స్థానిక ప్రాంతాల్లోకి నీరొచ్చి చేరుతోంది. కబ్జాలతో వరద వస్తోందని, వీటిని తొలగించాలని అక్కడి ప్రజల నుంచి అధికారులపై ఒత్తిడి వస్తున్నా రెండు రోజుల హడావుడి తర్వాత పట్టించుకోవడం లేదు.

అగ్ని ప్రమాదం

భైంసా: వినాయక్‌నగర్ ప్రాంతంలోని ఓ దుస్తుల దుకాణంలో శుక్రవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. స్థానికులు, దుకాణ యజమాని తెలిపిన వివరాల ప్రకారం.. చినాయ్ దుకాణ సముదాయంలోని స్నేహ డ్రెసెస్‌ను మూసివేసి వెళ్లారు. అనంతరం కాసేపటికి దుకాణం నుంచి పొగలు, మంటలు రావడాన్ని స్థానికులు గమనించి యజమానికి, అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. యజమాని వచ్చి షెట్టరు తీసి చూడగా లోపల మంటలు చెలరేగాయి. అంతలో అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలు ఆర్పారు.



ప్రజాగళం సభలో సంఘీభావం ప్రకటిస్తున్న ప్రజాసంఘాల నాయకులు, విద్యావేత్తలు


సభలో పాల్గొన్న దిలావర్‌పూర్ మండల ప్రజలు

ప్రజారోగ్యాన్ని దెబ్బతీసే పరిశ్రమ మాకొద్దు

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే: ప్రజాభిప్రాయసేకరణ లేకుండానే ప్రజలకు అనారోగ్యాన్ని, ఆహార సంక్షోభాన్ని సృష్టించే ఇథనాల్ పరిశ్రమను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రద్దు చేయాలని పర్యావరణవేత్త, డా. బాబూరావు, టీపీజేఏసీ కన్వీనర్ కన్నెగంటి రవి కోరారు. ఇథనాల్ పరిశ్రమ తరలింపునకు శుక్రవారం దిలావర్‌పూర్ పోచమ్మ ఆలయ సమీపంలో ఏర్పాటు చేసిన 'ప్రజాగళం' సభకు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. పర్యావరణానికి, ప్రజలకు హాని లేదని తప్పుడు సమాచారం అందించి పరిశ్రమలు ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఇలాంటి పరిశ్రమలు విడుదల చేసే రసాయనాలతో రోజురోజుకు భూఉష్ణోగ్రతలు పెరిగి కర్బన ఉద్గారాలు విడుదలై జల, పర్యావరణ కాలుష్యంతో తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. ఆహారమా, పెట్టుబడిదారులకు లాభాలా ఏది ముఖ్యమో ప్రభుత్వం ఆలోచించాలని కోరారు. పరిశ్రమను తరలించాలని దిలావర్‌పూర్, గుండంపల్లి గ్రామాల్లో 87 రోజులుగా రైతులు శాంతియుతంగా దీక్ష చేస్తున్నా పట్టించుకోకపోవడం సమంజసం కాదన్నారు. మండలంలోని పలు గ్రామాల్లో స్వచ్ఛందంగా దుకాణాలు మూసి సభలో పాల్గొన్నారు. నారాయణపేట జిల్లా చిత్తనూరు నుంచి వచ్చిన రైతులు అక్కడి పరిశ్రమతో తమకు జరుగుతున్న నష్టాలను సభలో వివరించారు. బహిరంగ సభకు ఎస్పీ జానకీ షర్మిల, భైంసా ఏఎస్పీ అవినాష్ ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు. తెవిచె అధ్యక్షులు అంబటి నాగయ్య, టీపీజేఏసీ నాయకులు వేణుగోపాల్, ఆశోక్‌కుమార్, న్యూడెమోక్రసీ నాయకుడు చలపతిరావు, మానవహక్కుల రాష్ట్ర నాయకుడు భుజంగ్‌రావు, కాంగ్రెస్ నాయకులు పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, అల్లూరి మల్లారెడ్డి, చిత్తనూరు ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు బండారి లక్ష్మయ్య, మండల ఐకాస నాయకులు రైతులు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేకతను ప్రభుత్వానికి విన్నవిస్తా:
ఆచార్య కోదండరాం, ఎమ్మెల్సీ



దిలావర్‌పూర్ ఏర్పాటు చేస్తున్న ఇథనాల్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఏడాదిగా పోరాడుతున్న ప్రజల తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక అందిస్తా. పూర్తిగా వ్యవసాయానికి అనుకూలంగా ఉన్న ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రజలను, జలవనరులను కలుషితం చేయరాదు.

ప్రజల ఆకలి కేకలను పట్టించుకోవాలి:
సంధ్య, పీఓడబ్ల్యూ జాతీయ అధ్యక్షురాలు



పరిశ్రమను రద్దు చేయాలని శాంతియుతంగా నిరసన తెలిపితే ప్రభుత్వం పట్టించుకోకపోవడం తగదు. వ్యవసాయంపై ఆధారపడిన ఈ ప్రాంతంలో ఇథనాల్ పరిశ్రమను రద్దు చేసేలా కృషి చేయాలి. ప్రజల సహనానికి పరీక్ష పెడితే ప్రభుత్వాలే ఇబ్బందులకు గురవుతాయి.

ఒకేరోజు.. రెండు చోరీలు

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: జిల్లాకేంద్రంలో ఒకే రోజున వేర్వేరు ప్రాంతాల్లో రెండు దొంగతనాలు చోటుచేసుకున్నాయి. పోలీసు పెట్రోలింగ్, గస్తీ ముమ్మరంగా ఉన్నప్పటికీ ఈ ఘటనలు చోటుచేసుకోవడం పట్టణవాసులను భయాందోళనకు గురిచేసింది. స్థానికులు, పట్టణ ఎస్సై అశోక్ కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. స్థానిక పాతబస్టాండ్‌లోని ఓ ఇంజినీరింగ్ అండ్ ఎలక్ట్రికల్ దుకాణంలో చోరీ జరిగింది. గురువారం అర్ధరాత్రి దాటాక తాళం పగులగొట్టి, షట్టర్ తలుపులు వంచి దొంగలు లోపలకు ప్రవేశించారు. రూ.4 లక్షలకు పైగా విలువైన రాగితీగను అపహరించారు. ఉదయం దుకాణం తెరిచేందుకు వచ్చిన యజమాని చోరీ విషయం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు.

● బంగల్‌పేట్‌కు చెందిన భూమయ్య దంపతులు ఆదిలాబాద్‌లో ఉంటున్న బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటికి తాళం వేసి ఉండటం గమనించిన దొంగలు దాన్ని పగులగొట్టి లోపలకు చొరబడ్డారు. బీరువా తెరిచి రూ.20 వేల నగదు, 2 తులాల వెండి, 8 గ్రాముల బంగారు ఆభరణాలను అపహరించారు. శుక్రవారం ఉదయం తలుపుతాళం పగులగొట్టి ఉండటం గమనించిన స్థానికులు బాధిత కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. వారు వచ్చి చోరీ విషయమై పోలీసులకు సమాచారం అందించారు. ఆయా ఘటనలపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.


షట్టర్ తలుపును వంచేశారిలా..


నైపుణ్యమే అధనం..

● టాస్క్ శిక్షణతో ఉద్యోగావకాశాలు

చదువులో రాణించాలన్నా.. ఉద్యోగం సాధించాలన్నా నైపుణ్యం ఒడిసిపట్టాల్సిందే. విద్యార్థి జీవితంలో ఇంటర్ తర్వాత వేసే ప్రతి అడుగు అత్యంత కీలకం. ఈ దశలో రూపుదిద్దుకున్న తీరు ఉన్నతి వైపు నడిపిస్తుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగాలకు అనుగుణంగా వారిని తీర్చిదిద్దేందుకు టాస్క్(తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ నాలెడ్జ్) కృషి చేస్తోంది. అవకాశాలు కోల్పోతున్న యువతలో అత్యున్నత నైపుణ్య వికాసంపై శిక్షణ ఇస్తోంది. సాధారణ విద్యార్థులు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా వివిధ రంగాల్లో రాణించేందుకు వారి భవితకు చేయూతనిస్తోంది.

మంచిర్యాల విద్యావిభాగం, న్యూస్‌టుడే


ఉద్యోగాలకు ఎంపికైన పలువురు విద్యార్థులు



యువతలో నైపుణ్యాలు పెంపొందించి ఉద్యోగ సాధనకు మార్గాన్ని సులువుగా చేయడమే లక్ష్యంగా టాస్క్ ముందుకు సాగుతోంది. డిగ్రీ, పీజీ, ఇంజినీరింగ్, పాలిటెక్నిక్, ఫార్మసీ, ఎంబీఏ ఇతర విద్యను అభ్యసించే విద్యార్థులకు వివిధ అంశాల్లో తర్ఫీదు అందిస్తోంది. టాస్క్‌లో నమోదు చేసుకోవడం ద్వారా నైపుణ్య అంశాలపై శిక్షణ ఇవ్వడంతో పాటు వివిధ సందర్భాల్లో సంస్థలు, పరిశ్రమల సహకారంతో నిర్వహించే ఉద్యోగ మేళాల్లో పాల్గొనే అవకాశం కల్పిస్తారు. తెలంగాణ అకాడమీ స్కిల్ అండ్ నాలెడ్జ్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో గత ఏప్రిల్‌లో నిర్వహించిన జాబ్‌మేళాలో పలువురు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. గత విద్యాసంవత్సరంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 45 ప్రభుత్వ, ప్రైవేటు కళాశాలల్లో విద్యార్థుల నమోదు ప్రక్రియ చేపట్టగా 1400 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి ఆయా కళాశాలల్లో టాస్క్ శిక్షణ పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు.

వివిధ అంశాలపై...

కళాశాల స్థాయిలో 40 నుంచి 50 మందిని బ్యాచ్‌లుగా విభజిస్తారు. ప్రతి విద్యార్థికి అర్థమెటిక్ అండ్ రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్, ఒక సాంకేతిక కోర్సు బోధిస్తారు. ప్రముఖ కార్పొరేట్, ఐటీ కంపెనీలకు క్షేత్రస్థాయి పర్యటనలకు తీసుకెళ్తారు. సామర్థ్యాలను పరీక్షించి ప్రతిభ ఆధారంగా ధ్రువపత్రాలు అందిస్తారు. ఉద్యోగ నియామకాల సమయంలో టాస్క్ ధ్రువపత్రానికి ప్రాధాన్యమిస్తారు.


మంచిర్యాల సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాలలో టాస్క్ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులు

మెలకువలు నేర్పించారు

సాక్షి అగర్వాల్, మంచిర్యాల



డిగ్రీలో చేరగానే టాస్క్‌పై అధ్యాపకులు అవగాహన కల్పించడంతో ప్రవేశం పొందా. ఉద్యోగ నైపుణ్య మెలకువలు, వ్యక్తిత్వ వికాసంపై శిక్షణ ఇచ్చారు. కళాశాల ప్రాంగణంలో నిర్వహించిన మేళాలో పాల్గొని ఇంటర్వ్యూని ధైర్యంగా ఎదుర్కొని స్థానిక పిరమల్ క్యాపిటల్ హౌసింగ్ ఫైనాన్స్ లిమిటెడ్ కంపెనీలో ఉద్యోగం సాధించా.

శిక్షణతో ఆత్మస్థైర్యం పెరిగింది

డి. లహరి, మంచిర్యాల



టాస్క్ శిక్షణలో ఉద్యోగానికి అవసరమైన మెలకువలు నేర్పించారు. సంస్థలు నిర్వహించే ఇంటర్వ్యూలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలు వివరించారు. వ్యక్తిత్వ వికాసం నైపుణ్యాలపై పట్టు సాధించా. డిగ్రీ పూర్తికాగానే ప్రాంగణ నియామకాల్లో ఇన్ఫోసిస్ కంపెనీలో ఉద్యోగం లభించింది.

మంచి అవకాశం

బి.దీపరెడ్డి ఉమ్మడి జిల్లా టాస్క్ రిలేషన్‌షిప్ మేనేజర్



టాస్క్ ద్వారా వివిధ కోర్సుల్లో అవగాహన కల్పిస్తూనే ఉపాధి పొందేందుకు సాయం అందిస్తున్నాం. ముందే రూపొందించుకున్న కార్యాచరణను పక్కాగా అమలు చేస్తున్నాం. అవసరమైన నైపుణ్యాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తూ పలు కంపెనీల్లో ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నాం. ప్రస్తుత సంవత్సరం దరఖాస్తుల ప్రక్రియ కొనసాగుతోంది.

45	ఉమ్మడి జిల్లాలో టాస్క్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న కళాశాలలు మొత్తం	డిగ్రీ కళాశాలలు	35	పాలిటెక్నిక్	6	పీజీ	3	ఇంజినీరింగ్	1	1150	గతేడాది నమోదు చేసుకున్న విద్యార్థులు	256	ఉద్యోగాలకు ఎంపికైనవారు


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

పరిశ్రమల దరఖాస్తులను త్వరగా పరిశీలించాలి

నిర్మల్, న్యూస్‌టుడే: నూతన పరిశ్రమల ఏర్పాటు కోసం వచ్చిన దరఖాస్తులను త్వరిగా పరిశీలించి చర్యలు చేపట్టాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సంబంధితశాఖల అధికారులతో ఏర్పాటుచేసిన సమావేశంలో మాట్లాడారు. టీఎస్ ఐపాస్ వెబ్‌సైట్‌లో నూతన పరిశ్రమల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తుల అనుమతుల జారీ పారదర్శకంగా ఉండాలని సూచించారు. ఇప్పటివరకు వచ్చిన దరఖాస్తులు, తిరస్కరణ వివరాలను తెలుసుకున్నారు. ప్రభుత్వ నియమాలు పాటించిన వారికి మాత్రమే పరిశ్రమల ఏర్పాటుకు అవకాశం కల్పించాలన్నారు. అనంతరం పీఎం విశ్వకర్మ పథకానికి దరఖాస్తులు ఎక్కువగా వచ్చేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. జిల్లా పరిశ్రమలశాఖ జనరల్ మేనేజరు నరసింహారెడ్డి, లీడ్ బ్యాంకు మేనేజరు రాంగోపాల్, జిల్లా ఎస్సీ సంక్షేమాధికారి రాజేశ్వర్‌గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రూపు-3 పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లు: అదనపు కలెక్టర్

నిర్మల్: జిల్లాలో గ్రూపు-3 పరీక్ష నిర్వహణకు ఏర్పాటు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ సంబంధితశాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి గ్రూపు-3 పరీక్షల నిర్వహణపై టీజీపీఎస్సీ ఛైర్మన్ మహేందర్‌రెడ్డి అన్ని జిల్లాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. పరీక్ష నిర్వహణ, ఏర్పాట్లు, తదితర అంశాలపై సూచనలు చేశారు. అనంతరం అదనపు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో గ్రూపు-3 పరీక్ష కోసం పరీక్ష కేంద్రాలను ఎంపిక చేయాలన్నారు. పరీక్ష నిర్వహించే కేంద్రాల్లో అన్ని వసతులు ఉండేలా చూడాలన్నారు. ప్రాంతీయ సమన్వయకర్త గంగారెడ్డి, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అండర్-14 జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలు

లక్ష్మణచాంద: అండర్-14 జిల్లాస్థాయి ఖోఖో ఎంపిక పోటీలను లక్ష్మణచాంద ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహిస్తున్నట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాజునాయక్ తెలిపారు. క్రీడాకారులు ఉదయం 10 గంటల లోపు పాఠశాలలో హాజరుకావాలని కోరారు.

మానసిక ధైర్యమే అసలైన మందు

నిర్మల్ పట్టణం: అనుకోకుండా ఏవైనా వ్యాధుల బారిన పడినపుడు ఆందోళనతో కుంగిపోవద్దని, ధైర్యంగా ఉండాలని జిల్లా బోధనాసుపత్రి పర్యవేక్షకుడు డా.గోపాల్‌సింగ్ అన్నారు. అదే అసలైన మందు అని, దానివల్ల చాలాత్వరగా కోలుకునేందుకు అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. పాలిటివ్ కేర్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా ప్రధాన ఆసుపత్రిలోని క్యాన్సర్ బాధితుల విభాగాన్ని శుక్రవారం పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి మానసిక ధైర్యాన్ని అందించారు. కేంద్రంలో అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆర్ఎంఓ డా.సుమలత, డా.రవీందర్, సౌజన్య, జిల్లా సమన్వయకర్త విమల తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల సంక్షేమమే ధ్యేయం: ఎమ్మెల్యే


కడెం జలాశయంలో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్, మత్స్యాభివృద్ధి సంస్థ ఛైర్మన్ సాయికుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి

కడెం, న్యూస్‌టుడే: మత్స్యకారుల సంక్షేమానికి సర్కారు అనేక పథకాలు అమలు చేస్తోందని ఎమ్మెల్యే బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన రాష్ట్ర మత్స్యశాఖ అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మెట్టు సాయికుమార్‌తో కలిసి కడెం జలాశయంలో చేప పిల్లలను విడుదల చేశారు. అక్కడే ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. గత పదేళ్లకాలంలో భారాస ప్రభుత్వం మత్స్యకారులను మోసం చేసిందన్నారు. ఇపుడు చెరువుల్లో చేపలు వదలడం లేదంటూ మాజీ మంత్రి హరీష్‌రావు అంటున్నారని, ఆయన కళ్లకు చికిత్స చేయించుకోవాలని, లేదంటే ఇలాంటి చెరువుల్లో దూకి చేప పిల్లలు ఉన్నాయో లేదో వచ్చి చూడాలని ఎద్దేవా చేశారు. గతంలో మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు త్వరలోనే పరిహారం ఇప్పిస్తామన్నారు. ఆర్డీఓ రత్నకల్యాణి, డీఆర్డీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ సుజాత, ఎంపీడీఓ అరుణ, మత్స్యశాఖ జేడీ శంకర్‌రాథోడ్, ఏడీ విజయ్‌కిరణ్, పీఏసీఎస్ ఛైర్మన్ శైలజ, మత్స్య సహకార సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కడెం: జలాశయంలో చేప పిల్లలు విడుదల చేసేందుకు వచ్చిన మత్స్యశాఖ అభివృద్ధి సంస్థ రాష్ట్ర ఛైర్మన్‌తో కలిసి ఎమ్మెల్యే శనివారం కడెం ప్రాజెక్టులో పడవలో విహరించారు.

ఖానాపూర్: గల్ఫ్ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు గల్ఫ్ కార్మికులకు ఎన్నారై పాలసీని అమలు చేసిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. పట్టణంలోని తెలంగాణతల్లి చౌక్‌లో గల్ఫ్ కార్మికుల కుటుంబాల సభ్యులతో కలిసి శుక్రవారం సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అంతకుముందు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గౌడ జన కార్మికులు 100 మందికి మత్స్యశాఖ రాష్ట్ర ఛైర్మన్‌తో కలిసి మోకు, ఇతర పరికరాలను అందజేశారు. ప్రజాప్రతినిధులు, నాయకులు దొనికెని దయానంద్, చిన్నం సత్యం, నిమ్మల రమేష్, షబ్బీర్‌పాషా, కావలి సంతోష్, తోట సత్యం, గంగనర్సయ్య, నాగరాజు, శేషాద్రి, జహీర్ తదితరులు పాల్గొన్నారు.

పాడికి ప్రోత్సాహకం.. లక్ష్యం దూరం

● ఉమ్మడి జిల్లాలో మూడు పాల శీతలీకరణ కేంద్రాల పరిస్థితి



న్యూస్‌టుడే, ఆదిలాబాద్ పట్టణం

పాడి రైతును ప్రోత్సహించేలా వారి నుంచి మద్దతు ధరకు పాలు కొనుగోలు చేసి విక్రయించేందుకు ప్రభుత్వం పాల శీతలీకరణ కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతన్నల కోసం ఆదిలాబాద్ పట్టణంలో తెలంగాణ పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య కార్యాలయాన్ని ఏర్పాటుచేసి ఇక్కడి నుంచే కార్యకలాపాలు సాగిస్తోంది. కొనుగోలు చేసిన పాలను ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ వసతిగృహాలు, కస్తూర్బాలు, గురుకులాలకు ప్యాకెట్ల రూపంలో సరఫరా చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో 2021లో మూడుచోట్ల రూ.18 కోట్లతో అందుబాటులోకి తెచ్చిన ఈ కేంద్రాల్లో పరికరాలు భారీ వ్యయంతో ఏర్పాటు చేసినా డిమాండ్‌కు తగ్గ పాలు సరఫరా కావడం లేదు. గతంలో డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆదిలాబాద్‌లోని ఈ పాల కేంద్రంలో 2 వేల లీటర్ల కంటే ఎక్కువ పాలు కొనుగోలు చేసేవారు కాదు. ప్రస్తుతం ఉన్న అధికారుల చొరవతో ఇది మూడింతలు దాటింది. కానీ ఈ కేంద్ర సామర్థ్యానికి ఉన్న లక్ష్యం ఎప్పటికీ నెరవేరదనడంలో సందేహం లేదు.

◆ మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేటలో రూ.6 కోట్లతో 20 వేల లీటర్ల పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడ 6 వేల నుంచి 7 వేల లీటర్ల కంటే ఎక్కువ పాలు రావడం లేదు. ఫలితంగా 10 వేల లీటర్ల సామర్థ్యంలో ఉన్న స్టోరేజీ ట్యాంకులు రెండు నిరుపయోగంగా ఉంటున్నాయి.

◆ నిర్మల్ జిల్లా సోఫీనగర్‌లో రూ.3 కోట్లతో 10 వేల లీటర్ల సామర్థ్యంతో 2021లోనే పాల శీతలీకరణ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. ఇక్కడ పరికరాలు, స్టోరేజీ ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. పరికరాలు అధ్వానంగా ఉండడంతో ఈ కేంద్రాన్ని మూసివేశారు. రైతుల కోసం అక్కడే రూ.50 లక్షల వ్యయంతో కొత్తగా కేంద్రాన్ని ఏర్పాటు చేసి నెట్టుకొస్తున్నారు.

ఈ మూడు కేంద్రాల కోసం రూ.14.60 కోట్లు, ఇతర ఖర్చులకు మరో రూ.3.40 కోట్లు.. మొత్తం కలిపి రూ.18 కోట్లు వెచ్చించారు. కానీ ప్రయోజనం అంతంతమాత్రమే.

ఆదిలాబాద్ పట్టణం గాంధీ పార్కు పక్కన పాల శీతలీకరణ కేంద్రంలో మూడేళ్లుగా ఉపయోగంలోకి రాని స్టోరేజ్ ట్యాంకులివి. ఒక్కో ట్యాంకు సామర్థ్యం 10 వేల లీటర్లు. రెండు ట్యాంకులు కలిపి 20 వేల లీటర్ల వరకు పాలు నిల్వ చేయొచ్చు. ఇదే కేంద్రంలో 5 వేల లీటర్ల ట్యాంకు మరో రెండు, చిన్న ట్యాంకులు మరో మూడు ఉన్నాయి. మూడేళ్లుగా నిరుపయోగంగా ఉన్నాయి. ఇక్కడ మొదటి నుంచి రైతులు పాలు విక్రయించేందుకు అంతగా రావడం లేదు. కానీ రూ.5.60 కోట్లతో 20 వేల లీటర్లకంటే ఎక్కువ సామర్థ్యం కలిగిన యూనిట్‌ను ఏర్పాటు చేశారు. అధికారులు కష్టపడి ప్రస్తుతం 7 వేల నుంచి 8 వేల లీటర్ల వరకు రోజూ కొనుగోలు చేస్తున్నారు.



విక్రయాలు పెరిగాయి..

- మధుసూదన్, డెయిరీ డిప్యూటీ డైరెక్టర్

రైతులకు పాలలో వెన్న ఆధారంగా చెల్లింపులు చేస్తున్నాం. ప్రస్తుతం సరాసరి లీటరుకు రూ.55 నుంచి రూ.60 వరకు అందిస్తున్నాం. 50 శాతం రాయితీపై పశు దాణా, పశువులలో పాల ఉత్పత్తి పెంచేందుకు 32 రకాల లవణాలు ఉండే మినరల్ మిక్చర్ తక్కువ ధరకు ఇస్తున్నాం. గడ్డి విత్తనాలు తక్కువ ధరకే అందిస్తున్నాం. ప్రోత్సాహకాలు అందించడంతో గతంలో కంటే పాల విక్రయాలు పెరిగాయి.

అభిరుచి.. ఆచరించి




ప్రపంచంలో ఎత్తయిన లెటర్ బాక్సు వద్ద ప్రణయ్‌కుమార్

జిల్లా కేంద్రానికి చెందిన బి.ప్రణయ్‌కుమార్ ఫొటోగ్రఫీ వృత్తిలో కొనసాగుతున్నారు. ఆయనకు ద్విచక్ర వాహనంపైన సాహసోపేత ప్రయాణం చేయడం అభిరుచి. ఇప్పటికే ప్రపంచంలోనే అత్యంత ఎత్తయిన ప్రదేశాలు లద్దాఖ్‌లోని ఉమ్‌లింగ్‌లా, ఖార్దుంగ్‌లా పర్వత ప్రాంతాలను సందర్శించారు. ఈ నెల 11న ఆదిలాబాద్ నుంచి బయలుదేరిన ఆయన తాజాగా హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం స్పితి జిల్లాలోని హిక్కిం గ్రామాన్ని 16న చేరుకున్నారు. అక్కడ ప్రపంచంలోనే ఎత్తులో ఉన్న తపాలాశాఖకు చెందిన లెటర్ బాక్సు(సముద్ర మట్టం నుంచి 14,400 అడుగుల ఎత్తు), ఇదే జిల్లాలోని కాజా వద్ద ప్రపంచంలోనే ఎత్తులో ఉన్న పెట్రోల్ పంపును(సముద్ర మట్టం నుంచి 12,270 అడుగుల ఎత్తు) దర్శించుకున్నారు. ఈ క్రమంలో 2,567 కి.మీ.లు బైక్‌పైన ప్రయాణించానని, మరో అయిదు రోజుల్లో ఆదిలాబాద్ చేరుకుంటానని ఆయన 'న్యూస్‌టుడే'కు ఫోన్‌లో వివరించారు.

- న్యూస్‌టుడే, ఆదిలాబాద్ క్రీడావిభాగం

ఈ పత్రాలే ఆధారం.. ప్రయోజనాలు అపారం

న్యూస్‌టుడే, చెన్నూరు గ్రామీణం :



మనకు తోడుగా కుటుంబసభ్యులు, బంధుమిత్రులు ఉంటారు. వారికి మించి మన వెంట ఉండాల్సినవి ధ్రువీకరణ పత్రాలు. మనిషి పుట్టుక నుంచి మొదలుకొని మరణం వరకు వీటి అవసరం వెలకట్టలేనిది. దైనందిన అవసరాల్లో జీవితాంతం బాసటగా నిలిచే వీటిని పొందడంలో ఏమాత్రం అలసత్వం చేయకూడదు.

ఆధార్

ప్రస్తుత పరిస్థితుల్లో ఆధార్‌కార్డు లేకుండా ఏ పని జరగదు. బ్యాంకు ఖాతా తెరవాలన్నా.. సిమ్‌కార్డు పొందాలన్నా ఇది తప్పనిసరి. ప్రభుత్వ పథకాలను పొందాలంటే ఆధార్ ఉండాల్సిందే.



పొందే విధానం: పిల్లలకు ఆధార్‌కార్డు తీసుకోవాలంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. ఆధార్ జారీ చేసే కేంద్రాలకు వెళ్లి జనన ధ్రువీకరణ పత్రంతో పాటు సంబంధిత దరఖాస్తు ఫారాన్ని ఇవ్వాలి. నిర్వాహకులు పిల్లల ఫొటో, ఇతర వివరాలను తీసుకొంటారు. వారం, పదిరోజుల్లో ఆధార్‌కార్డు పొందవచ్చు.

పాన్‌కార్డు



పాన్‌కార్డు లేకుండా ప్రస్తుతం ఏ బ్యాంకూ రుణం ఇవ్వడం లేదు. ఆదాయ పన్ను చెల్లింపులో ఇది ఎంతో కీలకం. గుర్తింపు కార్డుగా ఉపయోగపడుతుంది. మన ఖాతాలు, రుణాలు, ఆర్థిక పరిస్థితులు దీని ద్వారా తెలుస్తాయి.

- ఆధార్‌కార్డు, రెండు పాస్ ఫొటోలతో ఆన్‌లైన్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకుంటే పక్షం రోజుల్లో తపాలాశాఖ ద్వారా పాన్ కార్డు వస్తుంది. పాన్‌కార్డు పోతే ఆధార్ కార్డు ద్వారా తిరిగి పొందే అవకాశం ఉంటుంది.

ఓటరు గుర్తింపు పత్రం



భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటుహక్కు కల్పిస్తోంది. ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఇది అవసరం.

దరఖాస్తు ఇలా : వయసును నిర్ధారించే ఏదైనా ధ్రువీకరణ పత్రంతో ఒక పాస్‌ఫొటో, ఫారం-6ని పూర్తిచేసి ఆన్‌లైన్ కేంద్రాలతో పాటు చరవాణిలోమై ఓటర్‌యాప్‌లో కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

మరణ ధ్రువీకరణ..



ఒక వ్యక్తికి సబంధించిన ఆస్తి, ఆర్థిక, బీమా, తదితర ప్రయోజనాలను ఆ కుటుంబసభ్యులు పొందాలంటే మరణ ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. గ్రామాల్లో అయితే పంచాయతీ కార్యదర్శి, పట్టణాలు, నగరాల్లో పురపాలికలు, కార్పొరేషన్ల ద్వారా తీసుకోవచ్చు.

- మరణించిన వ్యక్తి ఆధార్‌కార్డు, అతని పాస్‌ఫొటో, ఒక ప్రభుత్వ ఉద్యోగి ష్యూరిటీ తీసుకోవాలి. దరఖాస్తు చేసే కుటుంబసభ్యుడి ఆధార్‌కార్డుతో మీసేవ కేంద్రంలో దరఖాస్తు చేస్తే విచారణ అనంతరం జారీ చేస్తారు.

డ్రైవింగ్ లైసెన్స్



ఇది లేకుండా వాహనాలు నడపొద్దు. తోడుగా లేకపోతే వాహనాల తనిఖీల సందర్భంగా జరిమానా విధిస్తారు. ప్రమాదాలు జరిగినపుడు ఎలాంటి బీమా వర్తించదు.

- వయసు నిర్ధారణ పత్రంతో పాటు ఆధార్‌కార్డు, చరవాణి నంబరుతో సంబంధిత ఫారాన్ని నింపి ఆన్‌లైన్‌లోనే రుసుం చెల్లించి స్లాట్ బుక్ చేసుకోవాలి. ఎంపిక చేసుకున్న తేదీన రవాణా శాఖ అధికారి(ఆర్టీవో) కార్యాలయానికి వెళ్లాల్సి ఉంటుంది. కార్యాలయంలో ఫొటో తీసుకున్న తర్వాత మొదట లెర్నింగ్ లైసెన్స్ ఇస్తారు. నెల నుంచి ఆరునెలల లోపు తిరిగి స్లాట్‌బుక్ చేసుకొని రవాణా శాఖ అధికారి (ఆర్టీవో) కార్యాలయానికి వెళ్తే పరీక్ష నిర్వహిస్తారు. అందులో ఉత్తీర్ణత సాధిస్తే డ్రైవింగ్ లైసెన్స్ జారీ అవుతుంది.

పేరు తప్పు రాకుండా చేసుకోవాలి

మీ దగ్గర అన్ని కార్డులు ఉండొచ్చు, కానీ వాటిల్లో ఏమాత్రం పేరు తప్పు దొర్లినా ఆ కార్డు నిరుపయోగమే అవుతుంది. అన్నికార్డుల్లో, బ్యాంకు ఖాతాల్లో పేర్లు ఒకే రకంగా ఉండాలి. జనన ధ్రువీకరణపత్రం లేదా పదోతరగతి మెమోలో ఉన్న పేరులో ఏవైతే అక్షరాలు ఉన్నాయో అవే ఉండేలా చూసుకోవాలి.



ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు చెన్నూరులోని మీసేవలో దరఖాస్తు సమర్పిస్తున్న తల్లిదండ్రులు

జనన ధ్రువీకరణ ఇలా..

శిశువు పుట్టిన తర్వాత వారి పేరును ఆన్‌లైన్‌లో నమోదు చేయించాలి. ఇది వయసును నిర్ధారించే ధ్రువీకరణ పత్రం. పాఠశాలల్లో పిల్లల్ని చేర్పించాలంటే జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి.

- ఆసుపత్రుల్లో జన్మించిన పిల్లల వివరాలను ఆసుపత్రి నిర్వాహకులే స్థానిక సంస్థల కార్యాలయాలకు అందజేస్తారు. తల్లిదండ్రులకు సైతం శిశువు జన్మించిన పత్రం అందజేస్తారు. దీంతో స్థానిక సంస్థల రిజిస్టర్‌లో నమోదైన సంఖ్యను తీసుకొని సంబంధిత ఫారాన్ని పూర్తిచేయాలి. తల్లిదండ్రుల పేర్లు, శిశువుకు పెట్టిన పేరును రాసి మీసేవలో దరఖాస్తు చేస్తే నాలుగైదు రోజుల తర్వాత జనన ధ్రువీకరణపత్రం అందుతుంది.



దండారీ ఉత్సవాలకు సన్నద్ధం..



నెమలి ఈకల టోపీని ద్విచక్ర వాహనంపై తీసుకెళ్తున్న యువకులు

దీపావళి పండగ సమీపిస్తుందంటే ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల్లో సందడి మొదలవుతుంది. ఆదివాసీలు ఎంతో పవిత్రంగా భావించే ఈ పండగ సందర్భంగా తండాల్లో దండారీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించడమే కారణం. పండగకు మూడు రోజుల ముందే భోగీ నిర్వహించిన తర్వాత ఆదివాసీ వాయిద్యాలైన డోల్, డోల్కి, వెట్టె, తబలా, సూర్నా, డప్పులు, నెమలి ఈకలకు ప్రత్యేక పూజలు చేస్తారు. పండగ రోజు ఏత్మసూర్ పేన్ (శివుడు-విష్ణు-బ్రహ్మ), ఇతర దేవతల వేషాలతో గుస్సాడీలుగా అలంకరించుకుని ఆక్డా దేవతకు పూజలు చేసి గుస్సాడీ దండారీ వేడుకలు నిర్వహిస్తారు. నెమలి ఈకలతో టోపీ తయారు చేసి ఉత్సవాల్లో నృత్యాలు చేయడం ఇక్కడి ప్రత్యేకత. ఈక్రమంలో పక్షం రోజుల ముందు నుంచే నెమలి ఈకలను సేకరించి టోపీలు తయారు చేయడంలో పెద్దలు నిమగ్నమవుతుంటారు.

- న్యూస్‌టుడే, నార్నూర్

సృజనాత్మకత చాటి.. జాతీయస్థాయిలో మెరిసి

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: చదివేది తొమ్మిదో తరగతే అయినా.. తనలోని ప్రతిభతో జాతీయస్థాయి పోటీల్లో రాణించింది. తోటి విద్యార్థులకు స్ఫూర్తిగా నిలిచింది. ఫెయిర్‌గేజ్ ద్వారా ఆన్‌లైన్ వేదికగా నిర్వహించిన పోటీల్లో ఆమె నగదు బహుమతికి ఎంపికవడం విశేషం. వివరాలిలా ఉన్నాయి. స్థానిక వేదం గ్లోబల్ పాఠశాలకు చెందిన చిన్నోళ్ల ప్రశస్తిని ఇండియా యాజ్ ఐ సీ-2024 పోటీలో భాగంగా 'పవిత్ర స్వేచ్ఛ' అనే అంశంపై జరిగిన వ్యాసరచన పోటీల్లో ఉత్తమంగా నిలిచింది. సృజనాత్మకతను చాటుతూ ఆమె రాసిన వ్యాసం మూడోస్థానం దక్కించుకుంది. ఈ మేరకు నిర్వాహకులు రూ.10 వేల నగదు, ప్రశంసాపత్రం అందజేశారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్వచ్ఛంద సేవా సంస్థ ఇండియా ఈజ్ అస్ భాగస్వామ్యంతో జరిగిన ఈ పోటీ విద్యార్థుల్లో దేశభక్తి పెంపొందించేందుకు, నాటి పోరాటయోధుల జీవిత విశేషాలను తెలియజేయడానికి, స్వేచ్ఛ-స్వాతంత్ర్యం విలువ చాటిచెప్పడమే లక్ష్యంగా సాగింది. దేశవ్యాప్తంగా వందలాది మంది పోటీపడిన కాంపిటీషన్‌లో నిర్మల్ జిల్లా విద్యార్థిని తృతీయస్థానంలో నిలవడంపై కలెక్టర్ అభిలాష అభినవ్ అభినందించారు. శుక్రవారం తన కార్యాలయానికి వచ్చిన విద్యార్థినితో మాట్లాడి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ భూపాల్, ఉపాధ్యాయురాలు ప్రవళిక పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నూతన కోర్సుల ఏర్పాటుకు కృషి

ముథోల్(బాసర), న్యూస్‌టుడే: బాసర ఆర్జీయూకేటీలో సాంకేతిక విద్యతోపాటు నూతన కోర్సుల ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తానని ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్ చెప్పారు. తొలిసారి విశ్వవిద్యాలయానికి వచ్చిన ఆయనకు పరిపాలన విభాగం అధికారి రణధీర్, ఆయా విభాగాల అధ్యాపకులు స్వాగతం పలికారు. అనంతరం ఆయా విభాగాల అధ్యాపకులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఆర్జీయూకేటీ పరిస్థితి, విద్యార్థుల వివరాలు, విభాగాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎవరికీ చెప్పకుండా నేరుగా భోజనశాలకు వెళ్లి భోజనం పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. అనంతరం వంటగది, సరకులను పరిశీలించారు. వంటగది అపరిశుభ్రంగా ఉండటంతో శుభ్రం చేయాలని ఆదేశించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఆయా విభాగాలకు వెళ్లి అధ్యాపకులతో మాట్లాడారు. వారి సమస్యలను స్వయంగా చూశారు. ఇక్కడ పనిచేసి బయటకు వెళ్లిన అధ్యాపకులు, సిబ్బందికి ఇచ్చిన గదులను వెంటనే స్వాధీనం చేసుకోవాలని ఆదేశించారు.




భోజనశాలలో భోజనం చేస్తున్న ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్

ఆర్జీయూకేటీని అగ్రగామిగా తీర్చిదిద్దుతా

'న్యూస్‌టుడే'తో ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్ - ముఖాముఖి

ముథోల్(బాసర), న్యూస్‌టుడే:

విద్యార్థుల అసౌకర్యాలను, విద్యాపరంగా నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తూ ఆర్జీయూకేటీని అగ్రగామిగా తీర్చిదిద్దుతానని ఇన్‌ఛార్జి ఉపకులపతి గోవర్ధన్ చెప్పారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఆయన శుక్రవారం బాసర ఆర్జీయూకేటీకి వచ్చారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ఆయా విభాగాలను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాలపై 'న్యూస్‌టుడే' ఉపకులపతితో ముఖాముఖి నిర్వహించింది.



? విశ్వవిద్యాలయంలో నెలకొన్న సమస్యలతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వీటి పరిష్కారానికి ఏం చర్యలు చేపట్టబోతున్నారు?

ఇక్కడ సమస్యలను పరిష్కరించడానికి నాపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించారు. తొలుత విద్యార్థుల సమస్యల పరిష్కారంపై దృష్టి సారిస్తాను. మిగతా వాటిని దశల వారీగా తీర్చడానికి కృషి చేస్తా. అయితే ఇందుకు కొంత సమయం పడుతుంది. విశ్వవిద్యాలయాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దడానికి శాయశక్తులా పాటుపడుతాను.

? విద్యార్థుల ఉద్యమం ఫలితంగానే మీ నియామకం జరిగిందనే దానిపై మీ స్పందనేమిటి?

ఇక్కడి సమస్యలను తీర్చే బాధ్యతలు నాకు అప్పగించారు. నమ్మకంతో పనిచేస్తాను. ఆకస్మిక తనిఖీలు చేపడుతాను. తప్పిదాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాను. ఇక్కడికి రాగానే నేరుగా భోజనశాలకు వెళ్లి విద్యార్థులతో కలిసి భోజనం చేశాను. పరిస్థితులు గమనించాను. అన్ని విభాగాలను పరిశీలించి సలహాలు, సూచనలను అందజేస్తాను. ఏ సమస్య ఉన్నా విద్యార్థులు నన్ను నేరుగా కలవొచ్చు. లేదంటే చరవాణిలో చెప్పొచ్చు.

? నాలుగేళ్లుగా ఏకరూప దుస్తులు, ల్యాప్‌టాప్‌లు, బూట్లు అందజేయడం లేదు.

ఇది ఆర్థికపరమైన సమస్య. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సి ఉంటుంది.

? విద్యార్థి సంఘం కార్యవర్గానికి ఆమోదం తెలపడం లేదని గతంలో ఆందోళన చేశారు. దీనిపై మీ వైఖరి ఏమిటి?

నేను విద్యార్థుల మధ్యనే ఉంటాను. వారికే సమస్య వచ్చినా అండగా ఉండి పరిష్కరిస్తాను. సంఘం విషయంలో విద్యార్థులను పిలిచి మాట్లాడతాను.

? ఉపకులపతులు హైదరాబాద్ నుంచి పర్యవేక్షణ చేస్తారనే విమర్శలు ఉన్నాయి..?

నేను ఎక్కువ సమయం బాసరలోనే ఉంటాను. విద్యార్థులు, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందికి సమయం కేటాయిస్తాను. వారి ఇక్కట్లను గమనించి తీర్చే యత్నం చేస్తాను. నేను కూడా వసతి గృహాల్లోనే ఉండి చదువుకొని ఉన్నతోద్యోగం చేస్తున్నాను. సమస్యలపై అవగాహన ఉంది.

? ఆరువేల మంది విద్యార్థినులకు ఆరుగురే కేర్‌టేకర్లు ఉన్నారు. వీరి సంఖ్య పెంచుతామని చెప్పినా ఆచరణలోకి రాలేదు?

ఈ సమస్య నా దృష్టికి వచ్చింది. దీనిపై సమీక్ష సమావేశంలో చర్చిస్తాం. ఏ విధంగా నియామకాలు చేపట్టాలన్న దానిపై ప్రభుత్వానికి నివేదిక అందజేసి సాధ్యమైనంత త్వరగా చర్యలు చేపడతాం.

? అందరూ తాత్కాలిక అధ్యాపకులే.. అందులోనూ సగానికి పైగా పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భర్తీకి ఏం చేస్తారు?

బోధన, బోధనేతర సిబ్బంది ఖాళీల వివరాలు సేకరించాను. వాటిపై ఉన్నతాధికారులతో మాట్లాడతాను. సాధ్యమైనంత త్వరగా ముఖ్యమైన పోస్టుల భర్తీకి ప్రయత్నాలు చేస్తాను.

నలుగురు అంతరాష్ట్ర నిందితుల అరెస్టు

● 900 కిలోల గంజాయి కేసులో సూత్రధారులు

ఆదిలాబాద్ గ్రామీణం, న్యూస్‌టుడే : ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం లక్ష్మీపూర్ చెక్‌పోస్టు వద్ద గత నెలలో రూ.2.25 కోట్ల విలువైన 900 కిలోల గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. అప్పుడు 8 మందిపై కేసు నమోదు చేశారు. ఐచర్ కంటైనర్ డ్రైవర్ వసీం, క్లీనర్ అర్మాన్‌లను అదే రోజు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న నిందితుల కోసం ప్రత్యేక పోలీసు బృందాన్ని ఏర్పాటు చేశారు. మహారాష్ట్రలో వారిని శుక్రవారం అరెస్టు చేశారు. గ్రామీణ సర్కిల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ జీవన్‌రెడ్డి వివరాలు వెల్లడించారు. సెప్టెంబరు 20న ఆంధ్రా - ఒడిశా సరిహద్దు నుంచి మహారాష్ట్రకు ఐచర్ వాహనంలో గంజాయిని ఆదిలాబాద్ మీదుగా తరలిస్తున్నారు. ఐచర్ వాహనంలో డ్రైవర్ వసీం, క్లీనర్ అర్మాన్ ఉన్నారు. వీరికి ఎస్కార్ట్‌గా వ్యాన్‌లో ముగ్గురు శుభం సాబ్లె, అమర్‌సింగ్, సోమనాథ్ ఉన్నారు. పోలీసులను చూసి వారు పరారయ్యారు. వీరు మహారాష్ట్రలోని బుల్దాన, జెల్గాన్ జిల్లాలకు చెందిన వారు. ప్రత్యేక పోలీసు బృందం వారిని అక్కడ అరెస్టు చేశారు. వీరితో పాటు వ్యాపారి గోతిరాం గురుదయాళ్‌సాబ్లెను కూడా అరెస్టు చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో భారీ మొత్తంలో మొదటిసారి గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కేసులో ప్రధాన సూత్రధారులైన ఒడిశాకు చెందిన అశీష్, పండిత్, సోనూ అన్సారీ, అన్షుజైన్, మరి కొంత మందిని పట్టుకునే వరకు ప్రత్యేక బృందం కార్యాచరణ కొనసాగిస్తుందన్నారు. ఈ కేసులో కృషి చేసిన జైనథ్, ఆదిలాబాద్ గ్రామీణ సీఐలు సాయినాథ్, ఫణిదర్‌తో పాటు గ్రామీణ ఎస్ఐ ముజాహిద్, సిబ్బంది రుక్మారెడ్డి, గంగాధర్‌రెడ్డి, శ్రీనివాస్, సిబ్బంది, తదితరులను జిల్లా ఎస్పీ గౌష్ ఆలం ప్రత్యేకంగా అభినందించినట్లు పేర్కొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

జాలి కాదు.. దారి చూపండి!

● గ్రామీణుల ని'వేదన'..



☛ఈయన పేరు టేకం లక్ష్మణ్(22). ఉట్నూరు మండలం బొప్పరికుంట గ్రామం. రెండు నెలల కిందట ఉట్నూరు నుంచి గ్రామానికి వెళ్తుండగా రహదారికి అడ్డంగా ఉన్న వాగులో గల్లంతై మృత్యువాతపడ్డాడు. ఏటా వాగులు దాటుతూ ప్రాణాలు కోల్పోతున్నా.. వాగులపై వంతెనలు నిర్మించడం, రహదారులను బాగు చేయడం మాత్రం కరవైంది.



☛కొన్నేళ్ల కిందట వంకతుమ్మ(ఏ) గ్రామానికి చెందిన కొడప ఎత్మాబాయికి పురిటినొప్పులు రావడంతో ఆసుపత్రికి తీసుకెళ్దామంటే గ్రామం నుంచి వెళ్లే మార్గంలోని వాగుపొంగి ప్రవహించింది. గ్రామస్థులు ఎన్ని ప్రయత్నాలు చేసినా సఫలం కాలేదు. ఎత్మాబాయి మృతి చెందిందని ఆమె తల్లి సాక్రుబాయి బోరుమంది.

☛ కుమురం భీం జిల్లా కెరమెరి మండలం లక్మాపూర్, గోరియగూడ, పరందోలి, మహరాజ్‌గూడ, మకద్దంపూర్, కొలాంగూడ గ్రామాల్లో 1500 మందికిపైగా నివసిస్తున్నారు. ఈ గ్రామాలకు వెళ్లే మార్గమధ్యలో లక్మాపూర్, గోరియాగూడ వాగులు ప్రవహిస్తున్నాయి.



గోరియగూడ, పరందోలి, మహరాజ్‌గూడ గ్రామాలకు వెళ్లాలంటే ఈ వాగు కష్టాలు తప్పవు

న్యూస్‌టుడే, ఉట్నూరు

భారీ వర్షాలు కురవగానే.. వాగులు పొంగి అనేక గ్రామాలలో రహదారులు ముంపునకు గురవుతున్నాయి. గ్రామస్థులకు బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగి వాగులు దాటే క్రమంలో ప్రాణాలు కోల్పోయే ప్రమాదకరమైన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. సమస్యను చూసి ప్రజాప్రతినిధులు, అధికారులు జాలి చూపడం తప్ప శాశ్వత పరిష్కారం చూపడం లేదనే విమర్శలొస్తున్నాయి.

వర్షాకాలం వచ్చిందంటే గిరిజన ప్రాంతాల్లో వాగులు పొంగి ప్రవహిస్తూ.. రాకపోకలు నిలిచిపోతున్నాయి. గూడేలు, తండాలలోని గర్భిణులు ప్రసవ వేదన, అనారోగ్యం, అత్యవసర పరిస్థితి ఏదైనా సాహసం చేయాల్సిందే. అన్ని సందర్భాల్లో ప్రాణాలు దక్కుతాయనే ఆశలేదు. వాగుల కారణంగా అనేక గిరిజన గ్రామాలకు '108' వంటి అత్యవసర వాహనాలు వెళ్లలేకపోతున్నాయి. విషజ్వరాలు, ప్రసవ వేదనతో సకాలంలో ఆసుపత్రికి చేరలేక మృత్యువాత పడుతున్నారు. వాగులపై వంతెనలను నిర్మిస్తేగానీ ప్రాణాలకు భరోసా ఉండదు.



ప్రమాదకరంగా మారిన వాగును పరిశీలిస్తున్న ఎస్ఐ మనోహర్, పోలీసుల బృందం

☛ ఇంద్రవెల్లి మండలం మామిడిగూడ, దుబ్బాగూడ గ్రామాలకు వెళ్లే మార్గమధ్యలో వడ్‌గావ్, ముత్నూర్ వాగులు వస్తాయి. వానాకాలంలో వాగులు పొంగి బాహ్యప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. వీటితో పాటు గోపాల్‌పూర్, కన్నాపూర్‌తండ, జైత్రంతండా, డొంగర్‌గావ్‌లలో రేషన్ బియ్యం కూడా తెచ్చుకోలేని పరిస్థితి.

అనుమతుల పేరిట..

ఉట్నూరు నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉండే వంకతుమ్మ(ఏ), వంకతుమ్మ(బి) గ్రామాలకు వెళ్లడానికి కనీసం రోడ్డులేదు. గతంలో ఉపాధి హామీ పథకంలో తాత్కాలికంగా మొరం రోడ్డు వేశారు. వర్షానికి అది కొట్టుకుపోయింది. మార్గమధ్యలో రెండు వాగులు ప్రవహిస్తున్నాయి.



నర్సాపూర్(జే) గ్రామానికి వెళ్లే రహదారి మధ్యలో వాగు

రెండు గ్రామాల్లో 700 జనాభా ఉంటుంది. 108, 104 వెళ్లలేని పరిస్థితి. ఇలా వైద్యం అందక ఈ గ్రామాలలో చాలా మంది మృత్యువాతపడ్డారు. వంకతుమ్మ(ఏ) గ్రామానికి, నర్సాపూర్(జే) గ్రామాలకు ఈ సమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం బీటీ రహదారిని మంజూరు చేసినా అనుమతుల పేరిట పనులను అటవీశాఖ అధికారులు అడ్డుకున్నారు.

రేపు ఉమ్మడి జిల్లా ఖోఖో ఎంపిక పోటీలు

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: నిర్మల్ జిల్లా దిలావర్‌పూర్ మండలం లోలం గ్రామంలోని లిటిల్ స్కాలర్స్ ఉన్నత పాఠశాలలో ఆదివారం ఉమ్మడి జిల్లా ఖోఖో బాలబాలికల జూనియర్స్ విభాగం ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని ఉమ్మడి జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంద్రత్ ఈశ్వర్, ఎన్.శ్రీధర్ రెడ్డి తెలిపారు. ఆసక్తిఉన్న క్రీడాకారులు ఉదయం 10 గంటలకు తమ ఆధార్, బోనఫైడ్ ధ్రువపత్రం, పదో తరగతి మెమోతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.సురేశ్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాకేశ్‌కు రిపోర్టు చేయాలని పేర్కొన్నారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఈ నెల 28 నుంచి 30 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. 22.11.2006 తర్వాత జన్మించిన వారై ఉండాలని, వివరాల కోసం చరవాణి 93984 30685లో సంప్రదించాలని వివరించారు.

కుంటాల ఏఓగా విక్రమ్



కుంటాల, న్యూస్‌టుడే: కుంటాల వ్యవసాయాధికారిగా దిలారి విక్రమ్ శుక్రవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఉద్యోగ విధుల్లో ఇటీవల నూతనంగా చేరారు. ఇప్పటి వరకు భైంసా అర్బన్ ఏఓ ఆసం రవి అదనపు బాధ్యతలు చేపట్టారు.

మేమున్నాం.. మీకు తోడుగా...

నిర్మల్ 97053 46693
భైంసా 63099 94649
ఖానాపూర్ 96401 62091

సమస్య: ఖానాపూర్ పట్టణంలోని బస్టాండ్ వద్ద రహదారిపైనే ప్రైవేటు వాహనాలు, తోపుడు బండ్లు నిలుపుతున్నారు. వాహనదారులకు ఇబ్బందిగా మారింది. **-వేణు, వ్యాపారి, ఖానాపూర్**

సమాధానం: రహదారిపై వాహనాలు నిలపకుండా చర్యలు చేపడ్తాం
-మోయినొద్దిన్, ఆర్టీసీ కంట్రోలర్, ఖానాపూర్

-న్యూస్‌టుడే, ఖానాపూర్

మలుపులో పొదలు తొలగింపు

ఈనాడు స్పందనకు వందనం

లక్ష్మణచాంద, న్యూస్‌టుడే: మండలంలోని రాచాపూర్-పీచర మార్గంలో మలుపుల్లో ప్రమాదకరంగా ఉన్న పొదలపై ఈనెల 16లో 'ఈనాడు'లో 'మేమున్నాం మీతోడుగా' విభాగంలో ప్రచురితమైన సమస్యపై ఎంపీడీవో రాధ స్పందించారు. శుక్రవారం పంచాయతీ సిబ్బందిని ఏర్పాటు చేసి మలుపుల్లో ప్రమాదకరంగా ఉన్న పొదలను తొలగించేలా ఏర్పాట్లు చేశారు. ఈ మార్గంలో రెండు చోట్ల పొదలను తొలగించటంతో వాహనదారులు హర్షం వ్యక్తం చేశారు.


విజేతలకు బహుమతులు, ధ్రువపత్రాలు అందజేస్తున్న అతిథులు


పరీక్ష రాస్తున్న విద్యార్థినులు

సృజనకు పదును

విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు పోటీ పరీక్షలు దోహదం చేస్తాయని వక్తలు అన్నారు. శుక్రవారం నిర్మల్‌లోని విజయ ఉన్నత పాఠశాలలో 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించారు. 'ఇంటర్నెట్ వినియోగంతో లాభ నష్టాలు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం' అనే అంశంపై 8, 9, 10 తరగతుల వారికి చేపట్టగా మొత్తం 315 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన తొమ్మిదో తరగతి విద్యార్థిని కొప్పుల షణ్ముఖ (ప్రథమ), పదో తరగతి విద్యార్థినులు ఎడ్ల లాస్య (ద్వితీయ), ఏనుగు శ్రీజ (తృతీయ) స్థానంలో నిలిచారు. వీరికి అవార్డులు, ధ్రువపత్రాలను ఒలంపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అయ్యన్నగారి భూమయ్య, విద్యాలయం కరస్పాండెంట్ మంచిరాల నాగభూషణం, ప్రిన్సిపల్ సామ మోహన్‌రెడ్డి అందజేశారు. న్యాయ నిర్ణేతలుగా ఉపాధ్యాయులు సీహెచ్ ప్రవీణ్, కె.మహేశ్, అంజలి, ప్రతిభ వ్యవహరించారు

-న్యూస్‌టుడే, నిర్మల్ అర్బన్

ఆధునిక సాంకేతికత.. అతివలకు చేయూత

● ఏకరూప దుస్తుల కుట్టుతో మహిళల స్వయం ఉపాధి


తానూరులో ఏకరూప దుస్తులను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

దిలావర్‌పూర్, న్యూస్‌టుడే : అతివల ఆర్థిక స్వావలంభనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేయూత అందివ్వడంతో సెర్ప్ (ఐకేపీ) మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి పొందుతున్నారు.

జిల్లాలో స్త్రీనిధి, బ్యాంకు లింకేజీ వంటి రుణాలతో మహిళలు వివిధ వ్యాపార ఉపాధి మార్గాలను ఎంచుకుని రాణిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లో చదివే బాలబాలికలకు అవసరమయ్యే రెండు జతల ఏకరూప దుస్తులను సంఘాల సభ్యులే కుడుతూ ఉపాధి పొందుతున్నారు. ఏకరూప దుస్తులను కొలతలకు అనుగుణంగా కత్తిరించడానికి అధునాతన మిషన్లు అందుబాటులోకి రావడంలో సంఘం సభ్యులు బ్యాంకు లింకేజీ రుణాలలో వాటిని కొనుగోలు చేశారు.

అన్నిరంగాల్లో రాణించేలా ప్రోత్సాహం
- వెంకటసాయి ప్రసాద్, డీపీఎం

మహిళా సంఘాల సభ్యులు స్వయం ఉపాధి రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సహిస్తోంది. సకాలంలో రుణాలు చెల్లించి ఆర్థిక ప్రగతి పొందేలా అధికారులు సంఘం సభ్యులకు ఉపాధి మార్గాలను అందిస్తున్నారు. సభ్యులకు ఆసక్తి ఉన్న వ్యాపార రంగాలలో ముందుకు సాగేలా సహకరిస్తాం.

జిల్లాలో వివిధ పాఠశాలలకు సెర్ప్(ఐకేపీ) మహిళా సంఘాల సభ్యులు ఏకరూప దుస్తుల జతలు అందించిన వివరాలు ఇలా

ప్రభుత్వ పాఠశాలలకు 87,312	ఆశ్రమ పాఠశాలలకు 5,154	మహాత్మాగాంధీ జ్యోతిబాపులే పాఠశాలలకు 6156
జిల్లాలో కుట్టు మిషన్ కేంద్రాలు: 61	ఒక్కో జతకు ప్రభుత్వం ఇచ్చే కూలీ: రూ.75	జిల్లాలో ఉపాధి పొందుతున్న సంఘం సభ్యులు: 700
ఇప్పటి వరకు సంఘ సభ్యులు పొందిన ఆదాయం రూ.22 లక్షలు		

కొనుగోలు కేంద్రాలతోనే మద్దతు ధర


కుంటాలలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రామారావుపటేల్

కుంటాల, న్యూస్‌టుడే: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలతోనే రైతులు మద్దతు ధరలు లభిస్తాయని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ అన్నారు. కుంటాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం సోయా కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎకరానికి ఆరు క్వింటాళ్లు కాకుండా పది క్వింటాళ్లు కొనుగోలు చేసేలా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు దృష్టికి తీసుకెళ్లి రైతుల అభ్యున్నతికి కృషి చేస్తానన్నారు. రైతుల డిమాండ్ మేరకు నర్సాపూర్(జి), కుంటాల, లోకేశ్వరం మండలాలను కలుపుతూ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఏర్పాటుకు చర్యలు చేపడతానని పేర్కొన్నారు. పీఏసీఎస్ అధ్యక్షుడు సట్ల గజ్జారాం, మార్క్‌ఫెడ్ రాష్ట్ర సంచాలకుడు గంగాచరణ్, ఏఎంసీ సంచాలకులు తాటి మహిపాల్, శీల సాయికిరణ్, మాజీ ఎంపీపీ అప్క గజ్జారాం, నాయకులు జి.వి.రమణారావు, అశోక్, గజేందర్, శివ, మహేందర్, నరేష్, శేఖర్‌రావు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తా: ఎమ్మెల్యే

ముథోల్(బాసర): అందుబాటులో ఉండి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే రామారావు పటేల్ అన్నారు. బాసర తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం కల్యాణ లక్ష్మి, షాదిముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు పలు సమస్యలను విన్నవించారు. వాటిని సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తహసీల్దార్ పవన్‌చంద్ర, భాజపా మండల అధ్యక్షుడు కిషోర్‌దేశాయి, నాయకులు సతీశ్వర్‌రావు, సాంవ్లి రమేష్, సాయినాథ్, బిద్దుర్ రమేష్, పోగుల రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాధికారికి అభినందన

ముథోల్(బాసర): బాసర గ్రామానికి చెందిన బడకల సారిక వ్యవసాయాధికారిగా ఎంపికైంది. ఇటీవల కుభీరు మండల వ్యవసాయాధికారిగా బాధ్యతలు చేపట్టారు. శుక్రవారం బాసర గ్రామానికి వచ్చిన ఆమెను ఎమ్మెల్యే రామారావు పటేల్ సన్మానించి అభినందించారు. రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు.

క్షీరాభిషేకం

నర్సాపూర్(జి): తురాటి నుంచి బామ్ని గ్రామానికి రూ.3 కోట్ల నిధులతో రోడ్డు మంజూరు చేయించిన ఎమ్మెల్యే రామారావు పటేల్ చిత్రపటానికి మండలంలోని తురాటి గ్రామంలో క్షీరాభిషేకం చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే : హైదరాబాద్‌లో ఎస్‌సీఈఆర్టీ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సైన్స్ డ్రామా పోటీల్లో భైంసాలోని వికాస్ విద్యాలయం విద్యార్థులు ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారని డీఎస్‌వో కె.వినోద్‌కుమార్ తెలిపారు. విద్యార్థులు విద్య, మనస్విని, చందు, కిషోర్, కమలేష్, సూర్య ప్రకాశ్, కమలేష్, గంగాప్రసాద్ హాజరు కాగా వివిధ జిల్లాలతో పోటీ పడి ప్రతిభ కనబర్చి ధ్రువపత్రాలు పొందారని పేర్కొన్నారు. వీరితోపాటు పాఠశాల ప్రిన్సిపల్ రాజన్న, ఉపాధ్యాయులు రత్న, మధుకర్ హాజరయ్యారని వివరించారు. జిల్లా విద్యాధికారి ఎ.రవీందర్‌రెడ్డి వారిని అభినందించారని వెల్లడించారు.


ప్రోత్సాహక ధ్రువపత్రాలు అందుకున్న మిగతా వారితో భైంసా విద్యార్థులు

శివాజీనగర్‌లో బతుకమ్మ సంబరాలు

ఖానాపూర్: పట్టణంలోని శివాజీనగర్ కాలనీలో గురువారం రాత్రి సద్దుల బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. బతుకమ్మ వేడుకలు సోమవారమే నిర్వహించాల్సి ఉన్నప్పటికీ హైదరాబాద్‌లో కాలనీకి చెందిన యువకుడు రోడ్డుప్రమాదంలో మృతిచెందడంతో వాయిదా వేశారు. ఈ సందర్భంగా మహిళలు బతుకమ్మ పాటలపై ఆడి పాడారు. వేడుకల్లో మున్సిపల్ ఛైర్మన్ చిన్నం సత్యం, కాలనీకి చెందిన నాయకులు ద్యావతి రాజేశ్వర్, రాజగంగన్న తదితరులు పాల్గొన్నారు. అనంతరం సదర్మాట్ కాల్వలో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

సంతలో సంచుల పంపిణీ


జనాలకు సంచులు పంపిణీ చేస్తున్న ఎంపీవో అజీజ్‌ఖాన్

సారంగాపూర్, న్యూస్‌టుడే: సారంగాపూర్ వారసంతలో శుక్రవారం ఎంపీఈవో అజీజ్‌ఖాన్ ప్రజలకు సంచులను పంపిణీ చేశారు. ప్లాస్టిక్ నిర్మూలనలో భాగంగా ప్రత్యేకంగా తయారు చేయించిన వీటిని అందజేసినట్లు ఆయన తెలిపారు. సంతకు వచ్చిన అందరికి పంపిణీ చేశారు. త్వరలో ప్రతి ఇంటికి అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రతి ఒక్కరు సహకరించి ప్లాస్టిక్ వినియోగంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి గోపికృష్ణ, కారోబార్ ఉమామహేశ్వర్, మల్టీపర్పస్ వర్కర్లు తదితరులు ఉన్నారు.

గంగపుత్రుల సన్మానం

ఖానాపూర్: రాష్ట్ర మత్స్య సహకార కార్పొరేషన్ ఛైర్మన్ మెట్టు సాయికుమార్ శుక్రవారం ఖానాపూర్ వచ్చిన సందర్భంగా పట్టణ గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సత్కరించారు. ఎమ్మెల్యే బొజ్జు పటేల్, పుర ఛైర్మన్ చిన్నం సత్యంను సన్మానించారు. ఈ సందర్భంగా రాయితీపై వలలు, తెప్పలు, చేపపిల్లలు ఇవ్వాలని, మత్స్యకారులకు రూ.20 లక్షల ప్రమాదబీమా సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందజేశారు. సంఘం అధ్యక్షుడు పర్మి సురేష్, ప్రధాన కార్యదర్శి రమేష్, ఉపాధ్యక్షుడు పర్మి రమేష్, కార్యవర్గ సభ్యులు మైలారపు గంగాధర్, విలాస్, లాలు, రాకేష్, భీంరావ్, మెంగు భీమన్న, రవి, గడ్డిసురేష్, నర్సయ్య, మర్రి నరేష్ తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్‌గా నియమితులైన ఈటల శ్రీనివాస్‌ను తెలంగాణ గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(ఐకేపీ) మహిళలు శుక్రవారం సన్మానించారు. మండల కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సత్కరించారు. కార్యక్రమంలో ఏపీఎం వాణిశ్రీ, పీపీఎం విజయలక్ష్మి, సంఘ జిల్లా అధ్యక్షురాలు గంగామణి, మండల సమాఖ్య, గ్రామైక్య సంఘ సభ్యులు పాల్గొన్నారు.

పనులను సద్వినియోగం చేసుకోవాలి

ముథోల్: ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని ఉపాధిహామీ ఏపీఓ శిరీషారెడ్డి అన్నారు. మండలంలోని విఠోలి గ్రామంలో శుక్రవారం గ్రామ సభను ఏర్పాటు చేసి పనుల ఎంపిక చేశారు. కార్యక్రమంలో కార్యదర్శి అన్వర్, ఉపాధి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మదినిండా శ్రీనివాసుడే..

● ఏటా శ్రీవారిసేవలో తరిస్తున్న కుభీరు మండల మహిళలు

న్యూస్‌టుడే, కుభీరు: కుభీరు మండల మహిళలు నిత్యం వ్యవసాయ పనులు, బీడీలు చుట్టే పనుల్లో నిమగ్నమై ఉంటారు. కానీ ఏటా శ్రీవారి సేవలో నిమగ్నం అవుతున్నారు. తితిదే శ్రీవారి సేవను ప్రారంభించారు. తోటి యాత్రికులకు తోడ్పాటు అందించాలనే సంకల్పంతో వారం రోజులు పనులన్నీ పక్కనపెట్టి శ్రీవారి సేవకు బయలు దేరి వెళ్తున్నారు. మదినిండా వేంకటేశ్వరస్వామి కొలుస్తూ 19 మంది బృందం సభ్యులు అక్కడి అన్నదానం క్యూలైన్లు, పుస్తక, లడ్డూ విక్రయ కేంద్రాలు, కల్యాణ కట్ట, ఉచిత బస్సు సౌకర్యం, అద్దెగదుల సముదాయాలు, ప్రయాణ ప్రాంగణంలో విధులను నిర్వహిస్తున్నారు. భక్తులకు సేవలందిస్తున్న శ్రీవారి సేవకులపై న్యూస్‌టుడే కథనం..


సేవలో పాల్గొన్న కుభీరు మండల మహిళలు

మూడేళ్లుగా..
-లంక ముత్తవ్వ పార్డి(కె)



మూడేళ్లుగా శ్రీవారి సేవకు బృందం సభ్యులతో వెళ్తున్నాను. భక్తులకు సేవలు అందించటం కొత్త అనుభూతి ఇస్తుంది. ఏటా వడ్డికాసుల స్వామిని దర్శించుకుంటే కష్టాలు తొలిగిపోయి కుటుంబంలో సుఖశాంతులు కలుగుతాయి. భిన్న ప్రాంతాల భక్తులతో కలిసి భక్తులకు సేవలు అందించటం మరిచి పోలేని జ్ఞాపకం. వెంకటేశ్వరుని సేవలో పాల్గొనటం ఆనందంగా భావిస్తున్నా.

మరిచిపోలేని జ్ఞాపకం
-ప్యాట రాధ కుభీరు



తిరుమలలో శ్రీవారిని దర్శించుకోవటానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు. వారికి సేవలు అందించటం, శ్రీవారి సేవలో పాల్గొనటం అదృష్టంగా భావిస్తున్నా. శ్రీవారి సేవకు వచ్చేవారిని మూడేళ్లుగా తీసుకెళ్తున్నా. అంతర్జాలంలో సేవకు వెళ్లే మహిళల వివరాలు పొందుపరుస్తాం. ఆలయ అధికారులు మా బృందానికి కేటాయించిన సమయానికి ముందే కొండమీదికి చేరుకొని భక్తులకు అందించే సేవలో పాల్గొంటున్నాం. కొండపై వారంరోజులు ఇట్టే గడిచిపోతాయి. సేవతో ఆధ్యాత్మికత అలవర్చుకుంటున్నాం.

సేవా గుణం అలవడుతుంది..
-శీలేవార్ అంకిత, పార్డి(కె)



మా ఊరిలోని పలువురు మహిళలు ఏటా తిరుమల కొండకు సేవకు వెళ్తుంటారు. శ్రీవారి సేవలో పాల్గొనాలని చాలా రోజుల నుంచి ఉండేది. ఇప్పుడు అవకాశం వచ్చింది. స్వామి సేవలో పాల్గొంటే సేవా గుణం అలవడుతుంది. వారంరోజులు భక్తుల సేవలో ఉంటూ కొత్త విషయాలు తెలుసుకున్నా. అవకాశం లభిస్తే ఏటా సేవకు వెళ్తూనే ఉంటా. శ్రీవారి లడ్డూ కౌంటర్, పుస్తకాలు విక్రయించటం, క్యూలైన్‌ల్లో భక్తులతో మాట్లాడటం ఎంతో సంతోషాన్ని ఇచ్చింది. సేవను ఎప్పటికి గుర్తించుకుంటా.

నేర వార్తలు

కల్వర్టును ఢీకొని ఒకరి దుర్మరణం


దేగాం గ్రామ సమీపంలో ప్రమాద దృశ్యం

భైంసా గ్రామీణం, న్యూస్‌టుడే: కల్వర్టు రక్షణ గోడను వాహనం ఢీకొని ఒకరు మృతి చెందిన ఘటన భైంసా మండలం దేగాం గ్రామ సమీపంలో శుక్రవారం చోటుచేసుకుంది. భైంసా గ్రామీణ ఎస్సై జి.శ్రీనివాస్‌యాదవ్, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా పట్టణంలోని బట్టి గల్లీకి చెందిన డ్రైవర్ వాస్టర్ సాయినాథ్ (36) భైంసా నుంచి బాసరకు వాహనంలో ఎరువుల బస్తాలను తరలిస్తుండగా అది అదుపుతప్పి కల్వర్టుకు ఢీకొంది. దీంతో సాయినాథ్ అక్కడికక్కడే మృతి చెందారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

యువకుడి ఆత్మహత్య


సచిన్

కుంటాల: మద్యానికి బానిసై ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని కల్లూరులో జరిగింది. కుంటాల ఏఎస్సై రాందాస్ తెలిపిన కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన డొంగ్రే సచిన్ (29) గురువారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పిల్లలు అదే గ్రామంలోని అమ్మమ్మ ఇంటికి వెళ్లారు. మృతుడి భార్య వారిని తీసుకొచ్చేందుకు వెళ్లి వచ్చే సరి ఫ్యానుకు వేలాడుతూ కనిపించాడు. చిన్నపాటి అప్పులకు తోడుగా మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో ఈ అఘాయిత్యానికి ఒడిగట్టాడు. కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ముథోల్: మండలంలోని తరోడ గ్రామానికి చెందిన షేక్‌హైమద్(50) శుక్రవారం సాయంత్రం ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా.. షేక్‌హైమద్ కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషించేవారు. కొన్ని రోజులుగా మద్యానికి బానిసై పని చేయక ఇంటివద్ద ఉంటున్నారు. శుక్రవారం సాయంత్రం ఇంట్లో ఉరివేసుకొన్నారు. పోలీసులు ఘటనా స్థలిని సందర్శించి వివరాలు సేకరించారు. మృతుడికి భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

గంజాయి పట్టుకున్న పోలీసులు

తానూరు(భైంసా): మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతంలోని తానూరు మండలం బెల్‌తరోడ పోలీసు చెక్‌పోస్టు వద్ద తనిఖీల్లో గంజాయి పట్టుబడినట్లు ముథోల్ సీఐ మల్లేష్ శుక్రవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం నిర్మల్‌కు చెందిన సుధాకర్, దీపక్‌సింగ్ మహారాష్ట్రనుంచి కాలినడకన వస్తున్నారు. అక్కడ తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులను చూసి తప్పించుకుపోయే యత్నం చేశారు. అనుమానం వచ్చి ఇద్దరిని తనిఖీ చేయగా 500గ్రాముల గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయిని స్వాధీనం చేసుకుని, నిందితులను అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

వైభవంగా రథోత్సవం


రథాన్ని లాగుతున్న భక్తులు

ఖానాపూర్ గ్రామీణం, న్యూస్‌టుడే: గోదావరి నది తీరాన కొండపై స్వయంభువుగా వెలిసిన సుర్జాపూర్ శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరిగాయి. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు జాతర, రథోత్సవం నిర్వహించారు. భక్తులు పరిసర ప్రాంతాలతోపాటు ఇతర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో హాజరయ్యారు. రంగురంగుల విద్యుత్తు దీపాలతో అలంకరించడంతో ఆలయ ఆవరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. స్వామి వారు కొలువుదీరిన రథాన్ని తాళ్లతో లాగడానికి భక్తులు ఉత్సాహం చూపారు. డప్పుచప్పుళ్ల నడుమ రథాన్ని ప్రధాన వీధులగుండా ఊరేగించారు.

కాగడ హారతి ప్రారంభం


కుభీరులోని విఠలేశ్వరుని ఆలయంలో కాగడ హారతికి హాజరైన ప్రజలు

కుభీరు, న్యూస్‌టుడే: కుభీరులోని తెలుగింటి పండరీపురంగా విరాజిలుతున్న విఠల్-రుక్మిణీ బాయి ఆలయంలో నెలరోజుల పాటు నిర్వహించే కాగడ హారతి శుక్రవారం ప్రారంభమైంది. తొలుత దేవతామూర్తులకు అర్చకుడు ప్రమోద్ మహారాజ్ అభిషేకం, పూజలు నిర్వహించారు. అనంతరం కాగడ హారతి ప్రారంభించారు. ఆలయకమిటీ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

ఘనంగా శారదాదేవి పూజలు

ఆధ్యాత్మికం

భైంసా: పట్టణంలోని పురాణ బజార్‌లోని గోపాలకృష్ణ మందిర్, గుజిరిగల్లిలోని ఆర్యవైశ్య సంఘ భవనంలో శారదాదేవి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శుక్రవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఓడి బియ్యం సమర్పించారు. శనివారం శోభాయాత్ర నిర్వహించి నిమజ్జనం చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

అలరించిన భజన

నిర్మల్ పట్టణం, న్యూస్‌టుడే: రాజ్‌పురోహిత్ సమాజ్ ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో రాజస్థానీలు నిర్వహించిన భజన కార్యక్రమం ఆకట్టుకుంది. గురువారం రాత్రి ప్రారంభమైన భక్తిగీతాల పారాయణం శుక్రవారం ఉదయం వరకు కొనసాగింది. అంతకుముందు తమ ఆరాధ్యమైన స్వేతేశ్వర్ మహరాజ్ చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆశీర్వాదాలు అందుకున్నారు. పట్టణంతో పాటు ఆర్మూర్, ఆదిలాబాద్ ప్రాంతాల్లో స్థిరపడిన రాజస్థానీ కుటుంబీకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఏటా దసరా పండగ తర్వాత వచ్చే పౌర్ణమి రోజున ఈ కార్యక్రమం చేపట్టడం ఆనవాయితీగా వస్తోందని నిర్వాహకులు తెలిపారు.

నేడు పలుప్రాంతాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం

నిర్మల్ అర్బన్, న్యూస్‌టుడే: జిల్లాలోని పలు ప్రాంతాల్లో విద్యుత్తు లైన్లు, ఉపకేంద్రాల్లో మరమ్మతుల నిమిత్తం శనివారం వేర్వేరు సమయాల్లో విద్యుత్తు సరఫరా నిలిపివేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు.



☛ నిర్మల్‌లోని ఆదర్శనగర్, రాంనగర్, గాయత్రీపురం, ఆస్రా కాలనీ, ఈద్గాం, భాగ్యనగర్, చేపల మార్కెట్, సిద్దాపూర్, సోఫీనగర్, ఇందిరమ్మకాలనీ తదితర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంటు ఉండదు.

లోకేశ్వరం: మండల కేంద్రం లోకేశ్వరంతో పాటు పిప్రి విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 3 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తారు.

ఖానాపూర్ గ్రామీణం, ఖానాపూర్: ఖానాపూర్, సుర్జాపూర్ ఉపకేంద్రంలో మరమ్మతులతో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఖానాపూర్ పట్టణంతో పాటు మస్కాపూర్, సుర్జాపూర్, బాదనకుర్తి, వెంకటాపూర్, ఎక్బాల్‌పూర్ గ్రామాల్లో విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

లక్ష్మణచాంద: వడ్యాల్, పార్‌పెల్లి విద్యుత్తు ఉపకేంద్రాల పరిధిలో మరమ్మతుల కారణంగా వాటి పరిధిలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్తు సరఫరా ఉండదు.

పెంబి: పెంబి ఉపకేంద్రం పరిధిలోని అన్ని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్తు సరఫరాలో అంతరాయం కలుగుతుంది.

కడెం: కడెం, బెల్లాల్ సబ్‌స్టేషన్ల పరిధిలో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేస్తారు.

జ్వరంతో విద్యార్థి పరిస్థితి విషమం

లక్ష్మణచాంద: మండలంలోని వడ్యాల్ గ్రామానికి చెందిన పూసపత్రి శ్రీనివాస్- సుమలతల పెద్ద కుమారుడు లక్ష్మణ్(14) జ్వరంతో బాధపడుతుండగా పరిస్థితి విషమించింది. ప్రస్తుతం ప్రాణాపాయస్థితిలో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని గ్రామస్థులు, కుటుంబ సభ్యులు తెలిపారు. వారం క్రితం జ్వరం రాగా కుటుంబ సభ్యులు నిర్మల్‌కు తరలించారు. డెంగీగా వైద్యులు నిర్ధారించారు. పరిస్థితి విషమించటంతో హైదరాబాద్ తరలించారు. ప్రస్తుతం వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నాడని, వైద్య ఖర్చుల కోసం అపన్నహస్తం అందించాలని విజ్ఞప్తి చేశారు.

నియామకం

నిర్మల్ అర్బన్: నిర్మల్ గ్రామీణ మండలం చిట్యాల గ్రామానికి చెందిన అడ్డిగ లక్ష్మణ్‌ను మాదిగల అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నియమిస్తూ ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు నిగులపు లింగన్న తెలిపారు. ఏడాది పాటు ఆయన కొనసాగనున్నట్లు పేర్కొన్నారు. త్వరలో నియోజకవర్గ, మండల కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించినట్లు వెల్లడించారు.

మీసేవ సంఘ రాష్ట్ర కార్యవర్గంలో చోటు

నిర్మల్ పట్టణం, ఖాన్‌పూర్: తెలంగాణ మీసేవ ఫెడరేషన్ నూతన కార్యవర్గాన్ని తాజాగా ప్రకటించారు. ఇందులో నిర్మల్‌కు చెందిన పలువురికి చోటు దక్కింది. రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నిర్మల్ పట్టణానికి చెందిన మెరుగు పవన్‌కుమార్, మీడియా బాధ్యుడిగా ఖానాపూర్‌కు చెందిన కామోజీ వేణుగోపాల్ ఎంపికయ్యారు.

ఫిర్యాదు చేసినా పట్టించుకోరా?


నిర్మల్: కడెం మండలం పెర్కపెల్లిలో దివ్యాంగుడు సాదు రమేశ్‌పై దాడికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని దివ్యాంగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు సట్టి సాయన్న కోరారు. శుక్రవారమిక్కడ విలేకరులతో మాట్లాడారు. బాధితుడు కడెం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోవడం లేదన్నారు. సంఘ నాయకులు క్రాంతికుమార్, మధుకర్, ఇసాక్‌అలీ, నారాగౌడ్, శివకుమార్ పాల్గొన్నారు.

సభ్యత్వ నమోదు

ముథోల్(బాసర): ఉపాధ్యాయుల బిల్లుల బకాయిలను వెంటనే చెల్లించాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.భూమన్నయాదవ్ అన్నారు. బాసర మండలంలోని అన్ని పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు.

సంక్షిప్త సమాచారం

యూజీసీ నెట్‌కు అర్హత


ముత్యం

కుంటాల, న్యూస్‌టుడే: దేశంలోని ప్రతిష్ఠాత్మక విశ్వవిద్యాలయ జూనియర్ రీసెర్చ్ ఫెలోషిప్ (జేఆర్‌ఎఫ్), సహాయ ఆచార్య పోస్టుకు, పీహెచ్‌డీలో ప్రవేశానికి నిర్వహించే యూజీసీ నెట్ 2024 తెలుగు విభాగంలో కుంటాల గ్రామానికి చెందిన జక్కుల ముత్యం అర్హత సాధించారు. గత ఆగస్టు 24న పరీక్ష నిర్వహించగా గురువారం రాత్రి ఫలితాలు వెలువడ్డాయి. ముత్యం ప్రస్తుతం కుంటాల ఆదర్శ పాఠశాలలో తెలుగు అధ్యాపకుడిగా విధులు నిర్వహిస్తున్నారు.

చెస్‌లో జోన్ స్థాయికి ఎంపిక


ప్రతిభ

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో పదోతరగతి చదువుతున్న కదం ప్రతిభ అండర్-17 విభాగంలో చెస్‌లో నైపుణ్యంతో మొదటి స్థానంలో నిలిచింది. జోన్ స్థాయికి ఎంపిక కావడంతో ఎస్‌ఓ వీణ, ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.

కేంద్రం ఏర్పాటు చేయాలి

ముథోల్(బాసర): బాసరలో సోయాకొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని భారాస మండల అధ్యక్షుడు శ్యాం కోరారు. కేంద్రంఏర్పాటు చేయకపోవడంతో రైతులు గ్రామాలకు వచ్చే దళారులకు విక్రయించి నష్టపోతున్నారన్నారు.

జిరాక్స్ యంత్రం అందజేత

లక్ష్మణచాంద: మండలంలోని పీచరలో ఉపాధ్యాయులుగా పనిచేసి పదోన్నతిపై వెళ్లిన విద్యారాణి, హంసలతలు జిరాక్స్ యంత్రాన్ని శుక్రవారం పాఠశాల ఉపాధ్యాయులకు అందజేశారు.

భాజపా నాయకుల పరామర్శ

సారంగాపూర్: రాంసింగ్‌తండా రైతు చవాన్ ఇనేష్‌ను శుక్రవారం భాజపా మండల నాయకులు పరామర్శించారు. గురువారం ఆయన 62 గొర్రెలు, మేకలు పిడుగుపాటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. బాధితుడికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందించారు. నాయకులు చంద్రప్రకాష్‌గౌడ్, నారాయణ, రాంశంకర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, రాజేశ్వర్, సాహేబ్‌రావు, రాజేశ్వర్‌రెరెడ్డి, వెంకటేష్, భూమరెడ్డి, ప్రకాష్, రాంరెడ్డి పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక


దివ్యాంగుడికి పరీక్షలు చేస్తున్న అధికారులు

నిర్మల్: జిల్లా స్క్రీనింగ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ ఆధ్వర్యంలో రిట్రోఫిట్టెడ్ మోటరైజ్డ్ వాహనాల పంపిణీ కోసం అర్హులైన దివ్యాంగుల ఎంపిక ప్రక్రియ చేపట్టారు. హాజరైన దివ్యాంగుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించారు. జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.ధన్‌రాజ్, డీఆర్డీవో విజయలక్ష్మి, ప్రాంతీయ రవాణా అధికారి దుర్గాప్రసాద్, దివ్యాంగులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ఛైర్మన్ చెన్నయ్య

ఎస్సీ వర్గీకరణ ఆపకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం

నిర్మల్, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను ఆపకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం తీవ్రతరం చేస్తామని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి రాష్ట్ర ఛైర్మన్ చెన్నయ్య అన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ చేపట్టిన మాలల చైతన్య బస్సు యాత్ర శుక్రవారం రాత్రి నిర్మల్‌కు చేరుకుంది. స్థానిక ధర్మసాగర్ చెరువు మినీ ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి గౌరవ వందనం చేశారు. రాజ్యాంగానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేసే ఊరుకునేది లేదని, ఎస్సీ వర్గీకరణ కోసం వేసిన కమిటీని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మాల సంఘాలన్నీ ఏకతాటికిపైకి వచ్చి ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకించాల్సిన సమయం ఆసన్నమైందని చెప్పారు. మాల ఐకాస పేరుతో అన్ని పార్టీల్లో ఉన్న వారిని కలుపుకుని పెద్దఎత్తున పోరాటం చేస్తామన్నారు. రాష్ట్ర కో-ఛైర్మన్‌లు ఎర్రమల్ల రాములు, చెరుకు సుధాకర్, కరణం కిషన్, తాళ్లపల్లి రవి, బూర్గుల వెంకటేశ్వర్లు, గోపోలు రమేశ్, నల్లాల కనకరాజు, కేశవులు, జిల్లా ఛైర్మన్ బత్తుల రంజిత్, కో-ఛైర్మన్‌లు డి.రాములు, వెంకటస్వామి, వెల్మల రాజేశ్వర్, బొడ్డు లక్ష్మణ్, రొడ్డ గంగన్న, నాయకులు పాల్గొన్నారు.